

ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు.


- 8లో



ఆపదలోనూ అండగా..

కరోనా (కోవిడ్) మహమ్మారి రెండేళ్ల పాటు యావత్ ప్రపంచాన్ని వణికించింది.

- 8లో



సకల సౌకర్యాలు

సకల మౌలిక సదుపాయాలతో భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

కొటియా గ్రామాల్లో స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

- ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర విజ్ఞప్తి



సాలూరు: ఆంధ్రా ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు శనివారం ఆయన సాలూరులో మాట్లాడుతూ, కొటియా గ్రూప్ గ్రామాల్లో ఓటర్లు ఆంధ్రాలో పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓట్లు వేయకుండా ఒడిశా అధికారులు, పోలీసులు ఫోన్లలో బెదిరిస్తున్నారని పలువురు ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై చీఫ్ ఎన్నికల కమిషనర్, రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులు స్పందించాలని కోరారు. ఈ గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలను మోహరించి, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

మూడవ ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులు

పార్వతీపురం: జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బందికి మూడవ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోదకుమార్ మెహర్దా సమక్షంలో శనివారం కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ అనంతరం సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సీల్డ్ కవర్‌లో వివరాలు పంపించనున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం సీల్డ్ కవర్లను విప్పడంతో సిబ్బందిని ఏ పోలింగ్ కేంద్రానికి నియమించిందీ తెలుస్తుందన్నారు. మైక్రో అబ్జర్వర్ల రెండవ ర్యాండమైజేషన్, ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జ్, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


కుక్కల దాడిలో వృద్ధురాలి మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన బంటు లక్ష్మి (ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు బంటు లక్ష్మి (73)పై కుక్కలు దాడి చేయడంతో శనివారం మృతి చెందింది. బహిర్భూమికి వెళ్లిన ఆమెపై 5 కుక్కలు ఒకేసారి దాడిచేసి తలను ఛిందరవందర చేశాయి. శరీరమంతా గాయపరిచాయి. దూరం నుంచి గమనించిన ఓ వ్యక్తి దగ్గరకు వచ్చి చూసి బిగ్గరగా అరవడంతో గ్రామం నుంచి కొంతమంది వ్యక్తులు పరుగున వచ్చినప్పటికీ అప్పటికే వృద్ధురాలి శరీరమంతా కుక్కలు గాయపరచడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. అదే విషయం సంబంధిత ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి గంటేడ శంకరరావుకు గ్రామస్తులు తెలపగా కుక్కలు పట్టే బృందాన్ని తీసుకురావడానికి ఏర్పాట్లు చేశామని ఎన్నికల ముగిసిన వెంటనే కుక్కలు పట్టే వ్యక్తిని రాజమండ్రి నుంచి రప్పిస్తామని చెప్పారు. వారం రోజుల్లో గ్రామంలోని ముగ్గురు మహిళలపై కుక్కలు దాడిచేయగా ఇద్దరికి ప్రాణాపాయం లేదని గాయాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ఒకే గ్రామంలో ముగ్గురు మహిళలపై కుక్కలు దాడిచేసి బీభత్సం సృష్టించడంతో గ్రామస్తులు బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు.

బాసంగి ముంపులో ఏనుగులు



బాసంగిలో జలకాలాడుతున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి ముంపు ప్రాంతంలో ఏనుగులు జలకాలాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం ముంపులో ఉండి సాయంత్రానికి అరటి, పామాయిల్ తోటల్లోకి వచ్చాయి. అరటి పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట ఇంటికి వచ్చే సమయాన నేలకొరగడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

ఓటరు తీర్పు కోసం

పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. ఓటరు నిర్ణయం కోసం ఈవీఎంలు ఎదురు చూస్తున్నాయి. తమ భవిష్యత్తు విజయం కోసం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఆశాభావంతో ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఎన్నికల ప్రచారంలో తలమునకలైన రాజకీయ పక్షాల అభ్యర్థులు శనివారంతో రిలాక్స్ అయ్యారు. ఇప్పుడు ఓటరు దేవుళ్ల కరుణ కోసం కోటి ఆశలతో వేచిచూస్తున్నారు. ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచార శైలిని పరిశీలిస్తే.. –సాక్షి, పార్వతీపురం మన్యం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నూతన ఒరవడి
- ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ప్రజల్లోకి..
- అమలు చేసిన నవరత్నాలే విజయానికి బాట అన్న విశ్వాసం
- చెప్పడానికి ఏమీలేక ఓటుకు నోటునే నమ్ముకున్న ప్రతిపక్షాలు





మక్కువ: ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్లో) ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

ఏ ఎన్నికల్లోనైనా..తాము అధికారంలోకి వస్తే ఇలా చేయబోతున్నాం, ఇదీ మా మేనిఫెస్టో అంటూ అభ్యర్థులు ప్రచారం చేయడం చూస్తుంటాం. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. తాము దిగ్విజయంగా అమలు చేసిన నవరత్నాల సంక్షేమ పథకాలనే నమ్ముకుంటూ, ఓటు కోసం ప్రజల వద్దకు వెళ్లింది. ప్రతి కుటుంబానికీ ఆ ఫలాలు అందడం వల్లే అడుగడుగునా ఆ పార్టీ నేతలకు ఆదరణ లభించింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత దాదాపు నెల రోజులుగా వివిధ పార్టీల నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తిరుగుతున్నారు. అధికార వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రం కోవిడ్ విపత్కర పరిస్థితి మొదలు నిత్యం ప్రజల మధ్యనే ఉన్నారు. కోవిడ్ సమయంలో మిగిలిన పార్టీల నేతలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికే భయపడితే.. తామున్నామంటూ ప్రజలకు అండగా నిలబడ్డారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు. వారికి కావాల్సిన నిత్యావసరాలు, వైద్యసహాయం అన్నీ సమకూర్చారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ మేలును వివరిస్తూ, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. దీనివల్ల ఆయా గ్రామాలు, వార్డుల్లో సమస్యలనేవి లేకుండా పోయాయి. దాదాపు ఏడాది పాటు ఈ కార్యక్రమం సాగింది. దీంతో మా ఎమ్మెల్యే నిత్యం తమతోనే ఉంటున్నారన్న భావన ప్రజల్లో కలిగింది. నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయి. గ్రామగ్రామాన అభివృద్ధి కనిపిస్తోంది. ఇప్పుడు తాము చేసిన పనులనే చెప్పుకుంటూ ఓటర్ల వద్దకు వైఎస్సార్‌సీపీ నేతలు ధైర్యంగా వెళ్లగలిగారు.

- కురుపాం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన పాముల పుష్పశ్రీవాణి హ్యాట్రిక్ లక్ష్యంగా జోరుగా ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1,700 కోట్ల మేర ఇక్కడ ప్రయోజనం కల్పించినట్లు తన ఎన్నికల ప్రచారంలో ఆమె వివరించారు. పలు అభివృద్ధి పనులకు రూ.1,045 కోట్లు వెచ్చించడాన్ని ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. రూ.190 కోట్ల వ్యయంతో టేకరఖండి వద్ద నిర్మితమవుతున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల మరో మైలురాయిగా ఆమె చెబుతున్నారు. మొదటి విడతలో 5,295 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి 4,014 మందికి డీకేటీ పట్టాలను, రెండో విడతలో 829.50 ఎకరాల్లో 1,070 డీకేటీ పట్టాలను అందించి రైతులకు అండగా నిలిచామని ఆమె ప్రస్తావిస్తున్నారు.
- సాలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరదే మరోసారి విజయమని అక్కడి ప్రజలు అంటున్నారు. కొండ, మైదాన ప్రాంతాల కలబోతగా ఉన్న నియోజకవర్గాన్ని ప్రగతి పట్టాలెక్కించిన ఆయన..అదే తన ప్రచారాస్త్రంగా వినియోగించుకున్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలకు రూ.1,600 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.1,300 కోట్లు ఖర్చు పెట్టినట్లు ధైర్యంగా చెబుతున్నారు. సాలూరు పట్టణంలో రూ.82.85 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణం, బైపాస్ రహదారి నిర్మాణం, సాలూరులో ప్రతి ఇంటికీ తాగునీటి కోసం రూ.69 కోట్లతో ప్రాజెక్టుకు శంకుస్థాపన, రూ.17 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, అడవి బిడ్డలకు పట్టాల పంపిణీ..ఇలా అనేక అంశాలను ఆయన ప్రస్తావిస్తూ, ప్రజల మధ్యకు వెళ్లారు.
- పార్వతీపురం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని అభివృద్ధిని చేసి చూపించామని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అలజంగి జోగారావు ధైర్యంగా చెప్పారు. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.1,540 కోట్లను ప్రజలకు అందించడం, సుమారు రూ.650 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం, వంతెనలు, రహదారుల నిర్మాణం, 13,080 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు, కొత్తగా వైద్యకళాశాల మంజూరు వంటివాటిని వివరిస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పాలకొండ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది తామేనని వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పారు. నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1,300 కోట్లు లబ్ధిదారులకు అందించడం, నాన్ డీబీటీ కింద రూ.218 కోట్ల లబ్ధి కలిగించడం వంటి ప్రత్యక్ష లబ్ధితోపాటు.. కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణం, 4,086 మందికి ఇళ్ల పట్టాలు, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, రూ.214 కోట్లతో రూ.234 కి.మీ. మేర రహదారులు..వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, గిరిజనులకు చేసిన మేలును వివరిస్తూ ప్రజల వద్దకు వెళ్లారు. గిరిజన బిడ్డగా అక్కడి ప్రజలతో ఆమెకు ఉన్న పరిచయాలు..ప్రతి ఇంటి కష్టసుఖంలోనూ పాలుపంచుకోవడం ఆమె విజయానికి అదనపు బలంగా మారాయి.

ఓటుకు నోటుతో ప్రతిపక్షాల ఎర

ఓటర్లను ఆకర్షించేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. గతంలో చేసిన అభివృద్ధి పనులు ఏవీ లేకపోవడం..ప్రజావిశ్వాసం కోల్పోవడంతో నగదు, మద్యం పంపిణీపై దృష్టి సారించాయి. ఓటుకు రూ.1000 నుంచి రూ.1,500 వరకు ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. గ్రామాల్లో ఒకలా, పట్టణానికి మరోలా రేటు కట్టారు. మద్యం కూడా పెద్ద ఎత్తున పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ప్రచార సమయంలో వెనుక తిరిగినందుకు కార్యకర్త ఒక్కొక్కరికీ రూ.300, మద్యం, బిర్యానీని ప్రతిపక్ష పార్టీల నేతలు పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పుడు ఓటుకు కూడా బేరం పెట్టేశారు. సంక్షేమం, అభివృద్ధినే అధికార వైఎస్సార్‌సీపీ నమ్ముకుంటే..ఎలాగైనా అడ్డదారుల్లో అధికారంలో దక్కించుకోవాలన్న కుట్రతో కూటమి నేతలు వ్యూహాలు పన్నుతున్నారన్న చర్చ ప్రజల్లో నడుస్తోంది.



ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణికి ఘనంగా స్వాగతం పలికిన కురుపాం ప్రజలు



పార్వతీపురంటౌన్: పెదబొండపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు



సీతంపేట: మండలంలోని లంబగూడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి

గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలి

డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

కొమరాడ: గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మండలంలోని శివిని గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది చేపడుతున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఫీవర్ సమోదు,డ్రై డే నిర్వహణ కార్యక్రమాల గురించి ఆరా తీశారు సర్వేల్లో సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను ల్యాబ్‌లో త్వరగా పరీక్ష చేసి నివేదిక అందజేయాలని సూచించారు. అక్కడ జరుగుతున్న సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలను పరిశీలించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఫ్రైడేను డ్రైడేగా కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. డీహైడ్రేషన్‌కు గురి కాకుండా జాగ్రతలు పాటించాలని, అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది ప్రమీల, లత తదితరులు పాల్గొన్నారు.



శివినిలో గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

మల్లిలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: మండలంలోని మల్లి పీటీజీ గురుకుల బాలుర పాఠశాలలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్లు 80, 4వ తరగతిలో 29, ఐదులో 2, ఆరోతరగతిలో 5, ఏడు, ఎనిమిది తరగతుల్లో 6 చొప్పున, 9 వతరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని. వచ్చేనెల 5వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నామని వివరించారు.

మినీగురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అలాగే సీతంపేట, కారిగూడలలో ఉన్న మినీ గురుకుల పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. కారిగూడలో 1వ తరగతిలో 30, ఐదో తరగతిలో మిగులు సీటు 1, ఆరోతరగతిలో 3, ఏడో తరగతిలో 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే సీతంపేటలో ఒకటో తరగతి 30, రెండవ తరగతి 3, ఐదోతరగతి 2, ఏడో తరగతి 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులు నేరుగా ఆయా మినీ గురుకులాలకు అందజేయాలని, ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే నెల 6వ తేదీన లాటరీద్వారా సీట్లు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణంలోని డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామగ్రి స్వీకరణకు సంబంధించి ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల వారీగా వేసిన శిబిరాలలోని కౌంటర్ల వద్ద టేబుల్స్, కుర్చీల ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల సామగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గాలి, వెలుతురు, తాగునీటి వసతి కల్పించాలని స్పష్టం చేశారు. టాయిలెట్స్, నియోజకవర్గ శిబిరాల మ్యాప్‌ను అందరూ సులువుగా తెలుసుకునేవిధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును అందుబాటులో ఉంచిన జనరేటర్ల వివరాలను విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించాలని అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనుబాబును ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు సులువుగా చేరుకుని రోడ్డు పనులు చేపట్టాలని పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్ స్థలాన్ని గుర్తించి అదే స్థలంలో బస్‌లను నిలుపాలన్నారు. ఆయా అధికారులకు అప్పజెప్పిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర్‌రావు, డీపీహెచ్‌ఈఓ కేజీఎస్.నరసింగరావు, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాలరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై ఆరాతీస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఉదయం 4 గంటల నుంచి బస్సులు

జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బందికి ఆదివారం ఉదయం 4గంటల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కురుపాం, సాలూరు, పాలకొండ నియోజక వర్గ కేంద్రాలకు సిబ్బంది చేరుకోవడానికి బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల ఉత్తర్వులు చూపించి బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడానికి సిద్ధంగా ప్రజలు
- వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు



పార్వతీపురం: గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం వచ్చిన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ పరిపాలనలో సమతుల్యత పాటించారన్నారు. అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే ధ్యేయంగా, నవ నిర్మాణం చేపట్టే లక్ష్యంగా పరిపాలన సాగించినట్లు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల ఆర్థిక పరిస్థితి, విద్యాభివృద్ధి, ఆరోగ్యం బాగుండాలని, ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పార్వతీపురంలో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, పాడేరులో మెడికల్ కళాశాలను, సాలూరులో ట్రైబల్ యూనివర్సిటీని, కురుపాంలో ట్రైబుల్ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి

ప్రస్తుత ఎన్నికల్లో ఏర్పడిన ఎన్‌డీఏ కూటమిని ప్రజలు విశ్వసించడం లేదని కుంభా రవిబాబు అన్నారు. 2014లో సీఎంగా చంద్రబాబునాయుడు వచ్చిన తరువాత పోలవరంను ఏటీఎంగా వాడుకున్నారని, అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబునాయుడును ఇంటికి పంపాలని అప్పట్లో ధ్వజమెత్తిన ప్రధాని మోడీకి నేడు చంద్రబాబు ఎలా మంచివాడయ్యాడో తెలియజేయాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై నరేంద్ర మోడీపై ఉందని డిమాండ్ చేశారు. వందేళ్ల క్రితం నాటి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన సర్వే, భూ రికార్డులను ప్రస్తుతం మనం ప్రామాణికంగా తీసుకుంటున్నామని, దీనివల్ల గ్రామాల్లో భూ వివాదాలు వస్తున్నాయన్నారు. ఎవరి భూమి మీద వారికే సంపూర్ణ హక్కులు కల్పించేందుకు సంపూర్ణ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ చట్టం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

గేటు ఢీకొని జింకకు గాయాలు



పొదల్లో చిక్కుకున్న జింక

సీతానగరం: మండలంలోని జోగింపేట గురుకుల విద్యాలయం సమీపంలో ఉన్న తోట గేటును ఢీకొట్టడంతో ఓ జింక బలంగా గాయపడింది. శనివారం సాయంత్రం కొండ నుంచి బయటకు వచ్చిన జింక రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న మామిడి తోటలోకి వెళ్తున్న సమయంలో వాహనాలు తిరుగాడుతుండడంతో కంగారుగా వెళ్లి ఇనుప గేటును ఢీకొట్టి గాయపడింది. దీనిపై స్థానికుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారి సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వెదురు పొదల్లో చిక్కుకున్న జింకను రక్షించడానికి ప్రయత్నం చేస్తున్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు

సాలూరు: ఎన్నికల వేళ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగరాదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ ఆక్టోపస్ నరేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు శని వారం ఆయన సాలూరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో 143 పోలింగ్ లోకేషన్లలో ,193 పోలింగ్ స్టేషన్లను మొత్తం 26 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై, ప్రత్యేక బలగాలు తదితర 350 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రిటికల్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన చెందాన అప్పలనాయుడు(68) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అప్పలనాయుడు కొంతకాలంగా కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ ఫలితంలేకపోవడంతో బాధను తట్టుకోలేక పంటలో కలుపు నివారణకు తెచ్చిన గడ్డిమందు శుక్రవారం సాయంత్రం తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మీడియాతో కలెక్టర్ నిషాంత్ కుమార్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్



పార్వతీపురం పట్టణంలో మూసివేసిన మద్యం దుకాణాలు

పార్వతీపురం టౌన్/పార్వతీపురం: జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కును తన అంతరాత్మ ప్రబోధం మేరకు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని కోరారు. యువత, మహిళలు, పీవీటీజీలు, థర్డ్ జెండర్ ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికలకు ఇప్పటివరకు అన్ని ఏర్పాట్లు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్

జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144వ సెక్షన్ అమల్లోకి వస్తుందన్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని, ఇంటింటి ప్రచారంలో లౌడ్ స్పీకర్ల వినియోగం లేదా ఎక్కువ మందితో ప్రచారం పాల్గొనడం నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలను మూసివేయించారు. ఇది 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు వర్తిస్తుందని వివరించారు. జిల్లాలో 604 ఎఫ్ఐఆర్‌లు నమోద య్యాయని, రెండు కోట్ల రూపాయల విలువైన 61 వేల మద్యం సీజ్ చేశామని, 2019 ఎన్నికలలో సీజ్ చేసిన దానికి ఇది పది రెట్లు అని వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఎవరూ జిల్లాలో ఉండరాదన్నారు. నియోజక వర్గంలో ఓటు హక్కు ఉన్న వారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. లాడ్జిలు, వసతి అతిథి గృహాలను తనిఖీ చేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధి వరకు మాత్రమే వాహనాలను అనుమతించనున్నట్లు చెప్పారు. ఓటరు సహాయానికి వేసే తాత్కాలిక టెంట్లు రెండు వందల మీటర్లు తరువాత మాత్రమే వేయాలని, అక్కడ పార్టీల జెండాలు, గుర్తులు, ప్రచారం ఉండరాదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సహాయకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాలో 1031 పోలింగ్ స్టేషన్లు

జిల్లాలో మొత్తం 1031 పోలింగ్ స్టేషన్లను పాలకొండ నియోజకవర్గంలో 287, కురుపాం నియోజకవర్గంలో 268, పార్వతీపురం నియోజకవర్గంలో 233, సాలూరు నియోజకవర్గంలో 243 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో గల 1031 పోలింగ్ స్టేషన్లలో 883 సాధారణ పోలింగ్ స్టేషన్లు, 219 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి ఏర్పాట్లు చేశామని, 443 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు.

నాలుగు పంపిణీ కేంద్రాలు

పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గ కేంద్రాలలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 7 గంటలకు రిపోర్ట్ చేయాలని చెప్పారు. ఎన్నికల అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూమ్‌లను పార్వతీపురం పట్టణంలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేశామని, అక్కడే కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. జిల్లాలో అంతర్రాష్ట్ర ములిగూడ, బత్తిలి, భామిని, పి కోనవలస, కూనేరు కూడళ్లలోను, గుణుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్ కె బట్టివలస, అడారు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. వాటన్నిటిలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. 1150 మంది పోలీసు సిబ్బంది, ఆరు కంపెనీల కేంద్ర బలగాలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. 56 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 138 సెక్టార్ అధికారులను నియమించామన్నారు. 6,100 మందిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేశామని, ఎన్నికల వేళ సమస్యలు, అల్లర్లు సృష్టించరాదని కోరారు. అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటు లేని ఇతర ప్రాంతాలకు చెందిన వారు జిల్లా విడిచి వెళ్లాలని కోరారు.

ఈ గుర్తింపు కార్డులు వినియోగించవచ్చు

ఓటు వేసేందుకు 13 రకాల గుర్తింపు కార్డులు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డు కలిగిన ఓటర్లు దానిని పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు కార్డుగా ఉపయోగించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వివరించారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు గాని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను గాని అనుమతించబోరన్నారు. ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లు కింద తెలిపిన కార్డుల్లో ఏదో ఒక కార్డును గుర్తింపు కార్డుగా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు.

- ఆధార్ కార్డు
- ఉపాధి హామీ జాబ్ కార్డు
- పాస్‌బుక్ (అభ్యర్థి ఫొటోతో బ్యాంకు, తపాలా శాఖ)
- హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు (కేంద్ర కార్మిక శాఖ పథకం కింద)
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్ కార్డు
- స్మార్ట్ కార్డు (కేంద్ర కార్మిక శాఖ పథకం జారీ)
- పాస్‌పోర్ట్
- ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్
- సర్వీస్ ఐడెంటిటీ కార్డు (ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం/ రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన గుర్తింపు కార్డులు)
- అధికారిక గుర్తింపు కార్డు (అఫిషియల్ ఐడెంటిటీ కార్డు)–(పార్లమెంట్ సభ్యుడు/ శాసన సభ్యుడు/శాసన మండలి సభ్యుడు జారీచేసిన గుర్తింపు కార్డు)
- యునిక్ డిజేబులిటీ ఐడి (యుడీఐడీ)

వరంగల్‌లో లక్ష్మీపురం వాసి మృతి



ముసలినాయుడు (ఫైల్)

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గవర ముసలినాయుడు(సాయి)24 తెలంగాణలోని వరంగల్ బస్‌స్టేషన్ వద్ద టిప్పర్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మృతుడి సన్నిహితులు లక్ష్మీపురంలో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఈ సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముసలినాయుడు జీవనోపాధి నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని రామగుండంలో గల ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. రాష్ట్రంలో సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయడానికి ఊరు వచ్చేందుకు బయల్దేరిన ముసలినాయుడు సన్నిహితులతో కలిసి వరంగల్ బస్‌స్టేషన్‌కు వచ్చాడు. తిరిగి సన్నిహితులంతా కంపెనీకి వెళ్లడానికి అందరూ రోడ్డుపై ఉన్న సమయంలో ఓ టిప్పర్ వారి మీదుగా దూసుకుపోవడంతో ముసలినాయుడితో పాటు మరో సన్నిహితుడు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో ముసలినాయుడు దుర్మరణం చెందినట్లు సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నతల్లి, గోపాలం, చెల్లెలు రాధ భోరున విలపించారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న కొడుకును కోల్పోయిన వారి రోదన వర్ణనాతీతంగా ఉంది.

ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు

విజయనగరం అర్బన్: ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ ఛాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక కలెక్టరేట్ ఎన్ఐసీలో శనివారం ఈ ప్రక్రియ నిర్వహించారు.

జగనన్నను మరోసారి గెలిపించుకోవాలి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కన ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని అందించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. పట్టణంలో శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండే ముఖ్యమంత్రికి ప్రజలందరూ అండగా ఉండాల్సిన సమయం వచ్చిందన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకుడు తూముల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల స్వీకరణకు ఏర్పాట్లు

- రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన అనంతరం జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికల సిబ్బంది తీసుకువచ్చే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈవీఎంలు భద్రపరిచేందుకు, ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు లెండి ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రాజాం, నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జేఎన్‌టీయూ జీవీలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు ప్రదేశాల్లో వర్షానికి ఇబ్బంది పడకుండా రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక జర్మన్ హ్యాంగర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పది సాధారణ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే అదేరోజు రాత్రి జేఎన్‌టీయూ జీవీలో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే జేఎన్‌టీయూ జీవీ, లెండి ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆపదలోనూ అండగా..



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్



కోవిడ్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

- కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సకాలంలో వైద్యసేవలు అందడంతో నిలిచిన ప్రాణాలు
- గ్రామాల్లోనే కోవిడ్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు
- 38 క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు
- వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం

విజయనగరం ఫోర్ట్: కరోనా (కోవిడ్) మహమ్మారి రెండేళ్ల పాటు యావత్ ప్రపంచాన్ని వణికించింది. జ్వరం, జలుబు, దగ్గు వచ్చిందంటే చాలు జనం హడలిపోయేవారు. ఒక ప్రాంతంలో కోవిడ్ కేసు నమోదయితే ఆ ప్రాంతానికి కూడా ఎవ్వరూ వెళ్లేవారు కాదు. ఆ సమయంలో కరోనా లక్షణాలతో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ఇళ్ల నుంచి కూడా బయటకు రావడానికి భయపడుతున్న రోజుల్లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించింది. కోవిడ్ బారిన పడిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా అవసరమైన చికిత్సను సకాలంలో అందించింది. దీంతో ఎంతోమంది ప్రాణాలతో బయటపడ్డారు.

గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు

ఎక్కువ మందికి కోవిడ్ పరీక్షలు చేయడం ద్వారా కోవిడ్ వ్యాప్తిని అరికట్టవచ్చుననే ఉద్దేశంతో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు చేసింది. దీంతో వ్యాప్తిని తగ్గించగలిగారు. గ్రామాలతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో పరీక్షలు అధికంగా చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు నిర్వహించారు.

సకాలంలో చికిత్సతో నిలిచిన రోగుల ప్రాణాలు..

కోవిడ్ నిర్ధారణ అయిన వారికి ఇంట్లో ప్రత్యేకంగా ఉంచి మందులు అందించేవారు. ఎవరి పరిస్థితి అయినా ఆందోళనకరంగా ఉంటే అటువంటి వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలిచాయి.

38 క్వారంటైన్ సెంటర్లు..

హోమ్ క్వారంటైన్‌లో చికిత్స పొందే అవకాశం లేని రోగుల కోసం జిల్లాలో క్వారంటైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 108 అంబులెన్సుల ద్వారా రోగులను అక్కడకు తరలించి చికిత్సతో పాటు వసతి అక్కడే కల్పించారు. అదేవిధంగా పౌష్టికాహారం అందించారు. 14 రోజుల తర్వాత ఎంతో మంది మెరుగైన ఆరోగ్యంతో ఇళ్లకు వెళ్లారు.

ప్రతి ఆస్పత్రిలో ఆక్సిజన్ ట్యాంక్‌లు..

కోవిడ్ రోగులకు ప్రధాన సమస్య శ్వాస ఆడకపోవడం. వీరికి ఆక్సిజన్ అత్యంత అవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కోవిడ్ రోగులకు చికిత్స అందించే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోను ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయకముందు ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ద్వారా రోగులకు ఆక్సిజన్ అందించారు. కోవిడ్ పరీక్షలు, చికిత్స, క్వారంటైన్ సెంటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం జిల్లాలో రూ. 50 కోట్ల వరకు ఖర్చు చేసింది.

ఆర్థికసాయం..

కోవిడ్ వల్ల ప్రజలు పనులు కూడా చేసుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం నిత్యావసర వస్తువులు అందించింది. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ రూ. 1000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

ప్రభుత్వమే బతికించింది..

జ్వరం, దగ్గు, ఆయాసం ఉందని కోవిడ్ పరీక్ష చేయించుకుంటే పాజిటివ్ అని వచ్చింది. 108 అంబులెన్స్ ద్వారా జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌లో చేరాను. అక్కడ 14 రోజులు పాటు ఉంచి చికిత్స అందించారు. ప్రభుత్వమే నన్ను బతికించింది.

– వేచలపు దేముడు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

పునరావాస కాలనీల్లో.. సకల సౌకర్యాలు



గూడెపువలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వాసితులు నిర్మించుకున్న గృహాలు

- రూ. 30 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలంతో పాటు రూ.9.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- సంతోషం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు



గూడెపువలలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు



లింగాలవలసలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు

భోగాపురం: సకల మౌలిక సదుపాయాలతో భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తున్నారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాలతో సరితూగే విమానాశ్రాన్ని జీఎంఆర్ సంస్థ రూపొందిస్తోంది. విమానాశ్రయం పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు, గృహాలు కోల్పోయిన నాలుగు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచింది. భూములు కోల్పోయిన వారికి పూర్తిగా పరిహారం అందజేయగా..గృహాలు కోల్పోయిన బొల్లింకలపాలెం, రెల్లిపేట, మరడపాలెం, ముడసర్లపేట గ్రామాలకు చెందిన సుమారు 373 కుటుంబాలకు గూడెపువలస రెవెన్యూ పరిధిలోని 17 ఎకరాల్లో.. పోలిపల్లి రెవెన్యూ పరిధి లింగాలవలసలోని 25 ఎకరాల్లో ఇళ్లు నిర్మించింది. విశాలవంతమైన సీసీ రోడ్లు, విద్యుత్, కాలువలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, శ్మశానవాటికలు, పార్కులు, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వంటి సకల సదుపాయాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేసింది. ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంతో పాటు రవాణా చార్జీలతో కలిపి రూ.9.20 లక్షలు చెల్లించింది. దీంతో నిర్వాసితులు ఆయా పునరావాస కాలనీల్లో విశాలమైన ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.



లింగాలవలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల

ఎన్నో ప్రయోజనాలు ..



ఎక్కడో మారుమూల ఉన్న మా ప్రాంతం విమానాశ్రయం ఏర్పాటుకు ఇచ్చాం. ప్రభుత్వం మాకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించడం అభినందనీయం. గతంలో విద్య, వైద్యానికి నానా అవస్థలు పడే మాకు.. ఈరోజు జాతీయ రహదారికి ఆనుకుని అన్ని సౌకర్యాలు కల్పించారు.

– సబ్బి సూరమ్మ, నిర్వాసితురాలు, మరడపాలెం గ్రామం

మరో బంజారాహిల్స్..



విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా భూములు, గృహాలు కోల్పోయిన మేము ప్రారంభంలో చాలా బాధపడ్డాం. అయితే మొదట్లో లింగావలస వద్ద ఇచ్చిన నిర్వాసిత కాలనీ ప్రదేశాన్ని చూసి కొంత బాధపడ్డాం. ప్రభుత్వం ఈరోజు అదే కాలనీలో విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, గుడి, బడి, పార్కు సూపర్ కాంప్లెక్స్ వంటి సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఈ రోజు కాలనీలో జరుగుతున్న నిర్మాణాలు చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్న బంజారాహిల్స్‌ను తలపిస్తోంది.

– కొండపు నాగరాజు, నిర్వాసితుడు, మరడపాలెం గ్రామం



గూడెపువలసలో కాలనీలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం

క్లుప్తంగా

సక్రమంగా విధులు నిర్వహించాలి



టెండర్ ఓట్ల బ్యాలెట్ పత్రాల ఏర్పాటు పరిశీలిస్తున్న ఈఆర్వో జోసెఫ్ తదితరులు

రాజాం: ఎన్నికల విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని రాజాం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్.జోసెఫ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి, టెండర్ ఓట్ల బ్యాలెట్ పత్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల వివరాలు, విధులకు కేటాయించిన అధికారుల వివరాలపై ఆరాతీశారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌తో పాటు ఎన్నికల నిర్వహణ సమయంలో అధికారులు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించేందుకు స్థానిక ఐటీఐ కళాశాల వద్ద ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల ఆఫీసర్ రాజు, డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో సాగుదాం



మాట్లాడుతున్న పడాల ప్రసాదరావు

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు సూచించారు. స్థానిక విశ్వసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. భక్తులకు వివిధ సేవా కార్యక్రమాలు, వాటి ఫలితాలు, నామ సంకీర్తనలు, నగర సంకీర్తనలు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా ఇన్‌చార్జి శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి, మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ బాధ్యత ఫీల్డు అసిస్టెంట్లదే...



లింగాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తప్పనిసరిగా ఉండాలని ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల కారణంగా ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయంలోనే ఉపాధి పనులు చేయాలని, ఎండ తీవ్రత అధికంగా ఉంటే పనులు నిలిపి, ఇంటికి వెళ్లిపోవాలని వేతనదారులకు సూచించారు. జాబ్ కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలన్నారు. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పనులు జరిగే చోట టెంట్లు, చలువ పందిళ్లు వేసుకోవడంతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఈత సరదాకు చిన్నారి బలి

హిరమండలం: కోమనాపల్లి కాలనీకి చెందిన తెంబూరు వసంతరావు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ముగ్గురు పిల్లలతో వసంతరావు, ఉషారాణి దంపతులు శనివారం రుగడ సమీపంలోని వంశధార నదిలో స్నానానికి వెళ్లారు. రెండో కుమార్తె సంజన శ్రేయ (9) ప్రమాదవశాత్తూ గోతిలో పడిపోయింది. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకుంది. బయటకు తీసి సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ హఠాత్పరిణామంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. వసంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు.

చెప్పిందే చేశారు... చేసిందే చెప్పారు



గిరిజన వర్సిటీ శంకుస్థాపనలో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల

- ప్రజల మదిలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ముద్ర
- 59 నెలల వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వినూత్న పంథా
- అర్హతే ప్రామాణికంగా, అవినీతి రహితంగా అందజేత
- చేసిందే చెప్పుకుంటూ ప్రతి గడపకూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- ఎన్నికల ప్రచారంలో ప్రతిచోటా ప్రజల బ్రహ్మరథం
- సీఎం చెల్లూరు, బొబ్బిలి ప్రచారసభలతో శ్రేణుల్లో నూతనోత్సాహం
- శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెర
- 13న పోలింగ్‌కు అధికారుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ.. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల వర్సిటీగా స్థాయిపెంపు వంటివి కేవలం 59 నెలల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైనవే. మరి అంతకు ముందు 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కానీ, 4 దశాబ్దాల పాటు ప్రజల ఓట్లతో పదవులు పొందిన అశోక్ గజపతిరాజు కానీ విజయనగరం జిల్లాకు చేసిందేమిటి? అని ప్రశ్నిస్తే వారివద్ద చెప్పడానికి ఏమీ లేదు. ఇవి చాలదా? ఎవరిది మాటల ప్రభుత్వమో, ఎవరిది చేతల ప్రభుత్వమో! తాను అధికారం కోసం ఏ హామీ పడితే అది ఇవ్వనని, చేయగలదే చెబుతానని, చెప్పింది తు.చ.తప్పకుండా అమలుచేస్తానని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు. 2019 మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఈ విషయాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లగలిగారు. టీడీపీ నాయకులు జిల్లాకు చేసిందేమిటో చెప్పుకోవడానికి ఏమీ లేదు. జిల్లాకు వచ్చిన చంద్రబాబు, బాలకృష్ణ, లోకేశ్‌లు ఏం చేస్తామో చెప్పకుండా సీఎంను దుమ్మెత్తి పోయడానికి పరిమితమయ్యారు. ఇతర రాష్ట్రాలు, ఇతర పార్టీల నుంచి కాపీ పేస్ట్ చేసి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలపై ఊదరగొట్టడం తప్ప గతంలో తాము చేసిందేమీ చెప్పుకోలేకపోయారు. అందుకే ప్రజలకు ప్రతినిత్యం ఏదో ఒక బూచిని చూపించి ఓట్లను దండుకునేందుకు టీడీపీ నాయకులు వెనకాడట్లేదు. తమకు ఓటేస్తే అభివృద్ధి చేస్తేస్తామంటూ నమ్మశక్యం కాని, ఆచరణసాధ్యంకాని హామీలను గుప్పించారు. వాటిలో డొల్లతనమేమిటో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సమర్థంగా తిప్పికొట్టారు. తమ ప్రభుత్వ పాలనలో ఒనగూరిన ప్రయోజనాలను గణాంకాలతో ప్రజల ముందు ఉంచడం నూతన ఒరవడి. గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ఇందుకు చక్కగా ఉపయోగపడింది. ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ఏయే పథకాలు అందాయో వివరించడమే గాక, అర్హత ఉండి ఇంకా ఏమైనా అందలేదా అని ఆరా తీశారు. వెంటనే సచివాలయం ఉద్యోగులను అప్రమత్తం చేసి ఆ సమస్యను వెనువెంటనే పరిష్కరించారు. దీని ఫలితం వైఎస్సార్‌సీపీ బస్సుయాత్రల్లో కనిపించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం మేలు చేసిందో, రాజకీయంగా ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో చెప్పడానికి నిర్వహించిన ఈ యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నవరత్నాల పథకాలను ప్రారంభం నుంచి ఇప్పటివరకూ తుచ తప్పకుండా ఒక షెడ్యూల్ ప్రకారం అందించడాన్ని ప్రజలు మరచిపోలేదు. అందుకే ముఖ్యమంత్రి 2024 మేనిఫెస్టోలో 'నవరత్నాల ప్లస్'కు ప్రజలు ఆకర్షితులవుతున్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే అవన్నీ కచ్చితంగా అమలుచేస్తారనే భరోసా వారిలో కనిపించింది. అంతకన్నా ఎక్కువ బడ్జెట్ అయ్యే సూపర్ 6 పథకాలను టీడీపీ ప్రచారం చేసినా పెద్దగా ప్రజల నుంచి స్పందన కరువైంది. అంతేకాదు టీడీపీ హామీలను అమలు చేస్తే ఖజానా ఖాళీ అయిపోయి తమకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి కూడా ఉండదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నాటి టీడీపీ ప్రభుత్వం: ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. విజయనగరంలో ఏర్పాటు చేయిస్తామని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అశోక్ గజపతిరాజు దశాబ్దాలుగా రాజకీయ పదవులు పొందారు. చివరకు నెల్లిమర్ల వద్ద ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఏర్పాటుకూ ఇతోధికంగా సహకరించారే తప్ప ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఊసే తేలేదు. మళ్లీ 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ప్రజల ఓట్లతో కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్నా ఈ హామీ నెరవేర్చలేదు. ప్రజల దృష్టి మళ్లించడానికి మాన్సాస్ ట్రస్టు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హడావుడి చేశారు. నిధుల సమీకరణ పేరుతో విలువైన మాన్సాస్ భూములను చౌకగా అమ్మేశారు. తీరా మాన్సాస్ ట్రస్టు తరఫున ఏర్పాటు చేయలేమంటూ 2017 సంవత్సరంలో అప్పటికే కేంద్ర మంత్రిగా ఉన్న అశోక్ ఆ ట్రస్టు చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. మళ్లీ 2019 ఎన్నికలు వచ్చేసరికి మళ్లీ మెడికల్ కాలేజీ పెట్టేస్తామంటూ చంద్రబాబు టెంకాయ కొట్టేశారు. భోగాపురం విమానాశ్రయానికి శిలాఫలకం వేసినచోట నుంచే వర్చువల్‌గా శంకుస్థాపన చేసేశారు.

నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. గాజులరేగ వద్ద దాదాపు రూ.500 కోట్లతో రెండేళ్ల వ్యవధిలోనే తొలి దశ నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ పూర్తి చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సులో చేరారు.

నాటి టీడీపీ ప్రభుత్వం: భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులకు 2019 ఫిబ్రవరి 14వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు టెంకాయ కొట్టేశారు. అయితే 2014వ సంవత్సరంలోనే అధికారంలోకి వచ్చిన ఆయన 2019 సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు వరకూ శంకుస్థాపన ఎందుకు చేయలేదు? ఎందుకంటే... ఎన్నికల్లో దాన్ని చూపించి ఓట్లు దండుకోవడానికి! తాము అధికారంలోకి వస్తే పనులు పూర్తి చేయిస్తామంటూ మళ్లీ ఇప్పుడు చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారు. వాస్తవానికి ఆయన విమానాశ్రయ అవసరానికి మించి ఐదు రెట్లు మేర భూమి సేకరణకు నాటి టీడీపీ ప్రభుత్వం తెరలేపింది. దీంతో రైతులు ఆందోళనలకు దిగారు. న్యాయస్థానాల్లో ఫిర్యాదులు చేశారు. పునరావాసం, పరిహారం ఊసెత్తకపోవడంతో నిర్వాసితులూ ఆందోళన చెందారు. మరోవైపు కేంద్రం నుంచి అనుమతులేవీ రాలేదు.

నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: 2019లో అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర దశ దిశా మార్చేలా విమానాశ్రయం సాకారానికి నడుంబిగించింది. భూసేకరణ విజయవంతంగా పూర్తి చేసింది. పరిహారం, పునరావాసం తదితర అడ్డంకులన్నీ పరిష్కరించింది. కోర్టులు, ట్రిబ్యునళ్లలో కేసులను గెలిచింది. కేంద్రం నుంచి అనుమతులన్నీ తెచ్చింది. ఆ తర్వాతే 2023 మే 3వ తేదీన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.5 వేల కోట్ల వ్యయంతో తొలి దశను 2025 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో జీఎంఆర్ సంస్థ వాయువేగంతో నిర్మాణ పనులు చేస్తోంది.





భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంలో చురుగ్గా సాగుతున్న పనులు

అభివృద్ధి పథం

- విశాఖపట్టణం నుంచి రాయ్‌పూర్ వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. దీని అంచనా వ్యయం రూ.15,400 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3,778 కోట్లను భరిస్తోంది. రాజాపులోవ నుంచి సాలూరు వరకు 91 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం రూ.221 కోట్లతో పూర్తి అయ్యింది. ఎన్‌హెచ్–51 జాతీయ రహదారి పనులు వెంకయ్యపాలెం నుంచి రామవరం బ్రిడ్జి వరకు 27 కిలోమీటర్ల పొడవున రూ.80 కోట్లతో కొలిక్కి వచ్చాయి.
- పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద రూ.23.74 కోట్ల అంచనా వ్యయంతో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మే నెలలో శంకుస్థాపన చేశా రు. నిర్మాణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.
- ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే ఉండేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుంబిగించింది. విజయనగరం జిల్లాలో ఇంతవరకు 375 గ్రామ సచివాలయాలకు, 291 రైతు భరోసా కేంద్రాలకు, 177 వెల్‌నెస్ కేంద్రాలకు భవనాల నిర్మాణం పూర్తి అయ్యింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 125 గ్రామ సచివాలయాలకు, 99 ఆర్‌బీకేలకు సొంత భవనాల నిర్మాణం పూర్తి అయ్యింది. మిగిలినచోట్ల భవన నిర్మాణ పనులు ప్రగతి దశలో ఉన్నాయి.
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత ఖరీఫ్‌లో విజయనగరం జిల్లాలో 510, పార్వతీపురం మన్యం జిల్లాలో 185 రైతు భరోసా కేంద్రాల ద్వారా సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అందుకు సంబంధించిన సొమ్మును రైతుల ఖాతాలకే జమ చేసింది.
- రైతుభరోసా–పీఎం కిసాన్ పథకం కింద ఈ ఒక్క సంవత్సరంలోనే విజయనగరం జిల్లాలో 2.63 లక్షల రైతు కుటుంబాలకు రూ.302.57 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.46 లక్షల రైతు కుటుంబాలకు రూ.167 కోట్లు ప్రభుత్వం అందించింది.
- చిరుధాన్యాల సాగును, ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించే ఉద్దేశంతో విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం కల్లేపల్లిరేగలో రూ.2.50 కోట్లతో ఏర్పాటుచేసిన ఆరోగ్య మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.
- నాలుగు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. మరో రూ.80.84 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.
- ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే తగిన వైద్యం అందించేందుకు సీఎం శ్రీకారం చు ట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 2వేలకు పైగా మెడికల్ క్యాంపులను నిర్వహించారు.
- రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. మనబడి నాడూ–నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, ఇంగ్లిష్ మీడియం బోధన, ట్యాబుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టింది.
- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లాలో 78,429 గృహాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 27,142 గృహాలు మంజూరు చేసింది.



సీఎం సభలతో ఏకపక్షం...

'మీ డ్రీమ్స్ నా స్కీమ్స్' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తూ జిల్లా ప్రజలను గత 23వ తేదీన చెల్లూరు వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఉర్రూతలూగించారు. చంద్రబాబు చేసిన మోసాలను వివరిస్తూ, తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలేమిటో చెబుతుంటే సభ నుంచి మంచి స్పందన వచ్చింది. ఇక మలి దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా బొబ్బిలిలో ఈనెల 1న నిర్వహించిన రోడ్డుషో టీడీపీ శ్రేణుల్లో వణుకు పుట్టించింది. మండుటెండలో సైతం వేలాది మంది ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేవరకూ ఎదురుచూశారంటే ఆ అభిమానాన్ని అంచనా వేయడం కష్టమే. ఈ సభల తర్వాత వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం ఉధృతమైంది. శనివారం సాయంత్రంతో అన్ని పార్టీల ప్రచారానికి తెర పడింది. ఇక 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

నాటి టీడీపీ ప్రభుత్వం: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 2014 సంవత్సరంలో అంటే దాదాపు పదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసింది. 2019 మే వరకూ అధికారంలోనే ఉన్న గత చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందంటే? ఏమీ చేయలేక చేతులెత్తేసింది. నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతంలో లేదంటే సామీప్యంలో ఏర్పాటు చేయాల్సిన ఈ సంస్థను విశాఖ నగరానికి ఆనుకొని ఉన్న కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. టీడీపీ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇబ్బడిముబ్బడిగా లాభాలు గడించడానికి తప్ప ఆ సంస్థ సాకారానికి ఉపయోగపడలేదు.

నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాతే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి మోక్షం కలిగింది. తాత్కాలికంగా విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ భవనంలో 2019 ఆగస్టు 5న సీటీయూఏపీ తరగతులు ప్రారంభమయ్యాయి. గిరిజనులకు ఒక గుర్తింపుగా, వారికి సమీపంలో, వారి ప్రాంతంలోనే సువిశాల ప్రాంగణం కోసం సాలూరు నియోజకవర్గంలో 561.88 ఎకరాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించింది. రూ.23.60 కోట్లతో మౌలిక వసతులను కల్పిస్తోంది. 2023 ఆగస్టు 25న సీటీయూఏపీ సొంత భవనాల నిర్మాణ పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

- ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ రుణాలు, జగనన్న తోడు వంటి పథకాలతో జీవన ప్రమాణాలను మెరుగుపర్చింది.
- ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా ఇటీవల ఎస్.కోట మండలంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అనుమతిస్తూ మెస్సర్స్ జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ కంపెనీకి అనుమతి ఇచ్చింది. 985.7 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించింది. సుమారు రూ.15531.36 కోట్ల పెట్టుబడితో వచ్చే పరిశ్రమల ద్వారా 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లాలో రూ.96 కోట్ల విలువైన 3073 పనులు మంజూరయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.44.73 కోట్లతో 1,766 పనులు మంజూరయ్యాయి.
- ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే నాణ్యమైన పరిష్కారం చూపేందుకుగాను క్షేత్రస్థాయిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా దాదాపు ఏడు లక్షల మందికి ప్రభుత్వ సేవలు అందాయి.

కూరగాయల సాగుపై అవగాహన



ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘ సభ్యులకు సంబంధించిన పది సెంట్ల భూమిలో ఫార్మా మోడల్ విధానంలో కూరగాయల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం, ఎల్2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణలు కూరగాయల సాగు విధానాలను రైతులకు వివరించారు. ఈ విధానంలో 365 రోజులూ ఆకుకూరలు, మొక్క, తీగజాతి కూరగాయలను నిరంతరాయంగా పండించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేసే ఈ కూరగాయల సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో సంక్షేమ పాలనను ఆశీర్వదిస్తూ ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. గరివిడి ప్రధాన రోడ్డులో ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌బాబుతో కలిసి శనివారం భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన అందించారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి బొత్స సత్యనారాయణను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని కోరారు. బొత్స సందీప్ మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంతో మంచి జరిగిందని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి ఫ్యాన్‌గుర్తుపై ఓటేయాలని కోరారు. ర్యాలీలో మండల నాయకులతో పాటుగా కార్యకర్తలు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



గరివిడి ప్రధాన రోడ్డులో ర్యాలీ చేస్తూ ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొత్స సందీప్

మంచి చేస్తాం మద్దతివ్వండి

మెరకముడిదాం: మీకు మంచి చేస్తాం మీ మద్దతు ఇవ్వండి అంటూ మంత్రి బొత్స తనయుడు సందీప్‌బాబు ప్రజలను, కార్మికులను కోరారు. మండలంలోని ఎం.రావివలస, గాతాడ, బాడాం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణ, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. గర్భాంలోని ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమ కార్మికులతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బుర్లె నరేష్ కుమార్, వాకాడగోపి, తదితరులు పాల్గొన్నారు.



గర్భాం ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమలో కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స తనయుడు బొత్స సందీప్‌బాబు

